# రహదారిపై నిత్యం ప్రమాద ఘంటికలే

- విలువైన ప్రాణాలు గాల్లోకి..
- ఆందోళనలో వాహనదారులు
- చోద్యం చూస్తున్న హైవే అథారిటీ
- పోలీసులు చర్యలు చేపట్టినా ఆగని ప్రమాదాలు
- బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న కేసీఆర్ కాలనీ వాసులు


జాతీయ రహదారిపై ధ్వంసమైన డివైడర్లు


డివైడర్‌ను ఢీకొట్టి ట్రాన్స్‌ఫార్మర్‌పైకెక్కిన కారు (ఫైల్)


రోడ్డు దాటుతుండగా పల్టీకొట్టిన మారుతీకారు(ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 8: జాతీయ రహదారిపై నిత్యం ప్రమాద ఘంటికలు మోగుతూనే ఉన్నాయి. ఎప్పుడు ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయో తెలియని దుస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రామాయంపేటకు ఉన్న రెండు బైపాస్‌ల మధ్య వ్యత్యాసం మూడు కిలోమీటర్లు. పట్టణం నుంచి బయటకు వెళ్లాలన్నా లోపలకు రావాలన్నా దయనీయ పరిస్థితి. అక్కడ రోడ్డు దాటే ముందు ఎలాంటి సూచిక బోర్డులు లేవు. రోడ్డు వేసే ముందు వేసిన డివైడర్లు, బోర్డులన్నీ వాహనాలు ఢీకొట్టడంతో ధ్వంసమయ్యాయి. హైవే అథారిటీ సిబ్బంది ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ రహదారిపై ప్రయాణం అంటే ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని చేయాల్సిందే. బైపాస్ వద్ద రోడ్డుదాటే క్రమంలో ఎదురుగా వాహనాలు రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రమాదాలు ఎక్కువ శాతం దూరప్రాంతాలకు చెందిన వారివే. పట్టణ పోలీసులు బైపాస్ వద్ద వాహనాల వేగం అదుపు చేయడం కోసం ఎక్కడో ఒక దగ్గర వాహనాల తనిఖీని కూడా చేపడుతున్నారు. ఏదేమైనా ప్రజల విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోకుండా రోడ్డుపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం రోడ్డు అథారిటీ అధికారులపై ఉంది.

### వాహనదారులు సంయమనం పాటించాలి



వాహనాలు నడిపించేవారు సంయమనం పాటించాలి. తమ వాహనాలపై ఇతర గ్రామాలకు వెళ్లే ముందు మద్యం తాగకూడదు. మద్యం మూలంగానే రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రజలలో చైత్యనంరావాలి. అప్పుడే ప్ర మాదాలు తగ్గుముఖం పడ్తాయి. వాహనాల వేగాన్ని తగ్గించడం కోసం హైవేపై రోజూ డ్రంక్‌అండ్‌డ్రైవ్, వాహన తనిఖీ నిర్వహిస్తున్నాం.

– వెంకటరాజగౌడ్, సీఐ, రామాయంపేట

### ఇండ్లు ఇచ్చారు రోడ్డు మరిచారు

రెండేండ్ల కిందట కేసీఆర్ ప్రభుత్వం ఇండ్లు ఇచ్చింది. అప్పటికే ఎన్నికలు రావడంతో కేసీఆర్ ప్రభుత్వం పడిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను పట్టించుకున్న పాపానపోవడం లేదు. కాలనీ వాసులు ఇండ్లకు పోయేందుకు దారి లేదు. చీకటి పడితే ఈ ప్రాంతంలో ప్రమాదాలు పదుల సంఖ్యలో జరుగుతున్నాయి ఇంత జరుగుతున్న అధికారులు కనికరించడం లేదని కాలనీవాసులు గోడు వెల్లబోసుకుంటున్నారు. కాలనీకి వచ్చేందు కోసం రామాయంపేట నుంచి గతంలో రోడ్డు ఉండేది. ప్రస్తుతం ఆ రోడ్డు వెంట వెళ్తుంటే వ్యవసాయ భూముల వారు తమ స్థలాల నుంచి నడవద్దంటూ బెదిరిస్తున్నారు.

## ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందించడమే లక్ష్యం


నందగోకుల్‌లో మిషన్ భగీరథ నీటి స్వచ్ఛత పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నిజాంపేట, ఫిబ్రవరి8: ఇంటింటికీ స్వచ్ఛమైన మిషన్ భగీరథ నీటిని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఏఈ భిక్షపతి అన్నారు. శనివారం నందగోకుల్‌లో వాటర్ ట్యాంక్ ద్వారా ఇండ్ల సమూహాలకు నల్లాల ద్వారా సరఫరా అయ్యే మిషన్ భగీరథ నీటి స్వచ్ఛత పరీక్షలను సిబ్బందితో చేయించామన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సిబ్బంది పరశురాములు, నర్సింహులు ఉన్నారు.

## వలంటీర్లకు టీషర్టులు అందజేత


వలంటీర్లకు టీషర్టులు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ దామోదర్

నర్సాపూర్, ఫిబ్రవరి 8: మండలంలోని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1, 2 వలంటీర్లకు దాతలు శ్రీనివాస్, డాక్టర్ స్నేహ సహకారంతో టీషర్టులు అందజేసినట్లు ప్రిన్సిపాల్ డా.పి.దామోదర్ తెలిపారు. వలంటీర్లు బాధ్యతాయుతంగా ఉండి సమాజాన్ని పట్టిపీడుస్తున్న మూఢనమ్మకాలు, చెడు వ్యసనాలను రూపుమాపడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు డా.బి.సురేశ్‌కుమార్, శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డా.సమీరా నజరీన్ తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న నాయకులు

నిజాంపేట, ఫిబ్రవరి 8: నిజాంపేటకు చెందిన శోభారాణికి రూ.15,500, శ్రావణ్‌కుమార్ రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను వారి కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు నసీరొద్దీన్, మహేందర్, వెంకటేశం, రాజిరెడ్డి, రాజేందర్‌గౌడ్, భూమగౌడ్, రాములు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి స్నేహితుల సాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

రామాయంపేట, ఫిబ్రవరి 8: మ్యాదరి లక్ష్మమ్మ(60) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. విషయం తెలుసుకున్న మృతురాలి కుమారుడు సిద్దరాములు స్నేహితులు తలా కొన్ని డబ్బులు వేసుకుని అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

## నలుగురిపై కేసు నమోదు

శివ్వంపేట, ఫిబ్రవరి 8: ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌పై దాడికి యత్నించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌లోని ఐడియల్ ప్రైవేట్ స్కూల్‌లో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న రమేశ్ ఈ నెల 7న సాయంత్రం విద్యార్థులను ఇంటికి చేర్చేందుకు కొంతాన్‌పల్లి మీదుగా వెళ్తున్నాడు. గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అకారణంగా బస్సును బైక్‌తో అడ్డగించి డ్రైవర్ రమేశ్‌ను దుర్భాషలాడుతూ విద్యార్థులను ఇబ్బంది పెట్టాలని చూశారు. పెద్దల సమక్షంలో మాట్లాడినా వినకపోవడంతో డ్రైవర్ రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


చిట్కుల్ శివారులో గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం

చిలిపిచెడ్, ఫిబ్రవరి 8: మండలంలోని చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి ఆలయం వద్ద మంజీరా నదిలో శనివారం గుర్తు తెలియన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన భక్తు లు, స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై నర్సింహులు తన సిబ్బందిలో ఘటనా స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని నది లో నుంచి బయటకు తీశారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 38 ఏండ్లు ఉంటాయన్నారు. అనంతరం మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కార్యక్రమంలో ఏఎస్సై మిస్బొద్దీన్, సిబ్బంది దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సమన్వయంతో జాతరను జయప్రదం చేయాలి



పాపన్నపేట, ఫిబ్రవరి 8: ఈ నెల 26 నుంచి జరుగనున్న ఏడుపాయల జాతరలో అధికారులంతా సమన్వయంతో పని చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధశాఖల అధికారులు ఏడుపాయల్లో పర్యటించారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ మేరకు పోలీస్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, పంచాయత్‌రాజ్, హెల్త్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## బీసీలకు న్యాయం జరగాలి



చిలిపిచెడ్, ఫిబ్రవరి 8: బీసీల లెక్కల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలిగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. బీసీల సంఖ్య 50 శాతం దాటుతుందన్నది అంచనా. సర్వే శాస్త్రీయంగా జరగలేదన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉంది. అవసరమైతే మళ్లీ బీసీ గణన చేపట్టాలి.

- కుమ్మరి శంకరయ్య, మాజీ సర్పంచ్, గౌతాపూర్

## హెల్ప్ డెస్క్ ద్వారా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ

మెదక్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను హెల్ప్ డెస్క్ ద్వారా స్వీకరించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండరని పేర్కొన్నారు. ప్రజలు హెల్ప్ డెస్క్ ద్వారా దరఖాస్తులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఫైనాన్స్ మేనేజర్ ఘరానా మోసం

**నకిలీ బంగారం పెట్టి డబ్బులు మాయం చేసిన మేనేజర్**

నర్సాపూర్, ఫిబ్రవరి 8: నర్సాపూర్‌లోని ముత్తూట్ మినీ ఫైనాన్షియస్ ఆఫీస్‌లో మేనేజర్ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో అక్టోబర్ 3, 2024న ముత్తూట్ మినీ ఫైనాన్షియస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆఫీస్‌లో మేనేజర్‌గా శివంపేట మండలం, పెద్దగొట్టిముక్కల గ్రామానికి చెందిన గుండె రాజు పనిచేస్తున్నాడు. మేనేజర్ తనకు పరిచయం ఉన్న గుండె సురేశ్, గుండె ఆకాశ్, ప్రవీణ్‌తో కలిసి నకిలీ బంగారం పెట్టి తూకంలో తారుమారు చేసి సుమారు రూ.7,10,356 కాజేశారు. అనంతరం తప్పించుకు తిరుగుతున్నాడు. విషయం గ్రహించిన రీజినల్ మేనేజర్ ముప్పాల రాజు పోలీస్‌స్టేషన్‌లో నలుగురిపై ఫిర్యాదు చేశాడు. వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామాయంపేట, ఫిబ్రవరి 8: రామాయంపేటలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని రామాయంపేట, అక్కన్నపేట, దామరచెర్వు, కోమటిపల్లి, వెంకటాపూర్.ఆర్ గ్రామాల్లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 8: మండలంలోని సూరారం, ధర్పల్లి, శంకరంపేట, మడూర్, శాలిపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ దినాకర్ తెలిపారు. చిన్నశంకరంపేటలోని 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ



చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 8: ధర్పల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆర్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పరీక్షా ప్యాడ్లు పంపిణీచేశారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదిగి మంచి పేరు తేవాలన్నారు.

**రామాయంపేటలో..**



రామాయంపేట రూరల్, ఫిబ్రవరి 8: సానిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు శనివారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన సీఏ మౌనిక అజయ్ తన కూతురు ఆధియ పుట్టిన రోజును జరుపుకొన్నారు.

**మెదక్ పట్టణంలో..**



మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 8: హవేళీ ఘనపూర్ మండలం కూచన్‌పల్లి జడ్పీ పాఠశాలలోని 105 మంది పదో తరగతి విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రవణ్ శనివారం హెచ్ఎం మధుమోహన్‌తో కలిసి పరీక్షా ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. పాఠశాలలోని గ్రంథాలయంలో కావాల్సిన పుస్తకాల కోసం రూ. 31 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

# మండల బీజేపీలో ముసలం

- పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నికపై ఆగ్రహం
- సంబురాల నిర్వహణలో బయటపడ్డ తగాదాలు


వాగ్వాదానికి దిగిన బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు దాసు వర్గీయులు

వెల్దుర్తి, ఫిబ్రవరి 8: బీజేపీ వెల్దుర్తి మండల అధ్యక్షుడి ఎన్నికతో ముసలం మొదలైంది. శనివారం ఢిల్లీలో బీజేపీ గెలుపుతో వెల్దుర్తిలో నిర్వహించిన సంబురాల్లో బయటపడింది. పార్టీ మండల అధ్యక్షుడు పడిగె దాసు ఆధ్వర్యంలో సంబురాలు చేయడానికి పలువురు నాయకులు రాగా, విషయం తెలుసుకున్న మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఎవరికీ సమాచారం లేకుండా సంబురాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఎవరికి చెప్పి, ఎవరు ఎన్నుకుంటే అధ్యక్షుడు అయ్యాడంటూ దాసు, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దాసు, అనుకూల నాయకులు శ్రీనివాస్‌పై విమర్శలకు దిగారు. దీంతో శ్రీనివాస్‌కు దాసుతో పాటు వర్గీయులకు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నది. ఒకానొక దశలో దాడికి దిగడానికి ఇరువర్గాల వారు ముందుకు రావడంతో ఇతర నాయకులు నచ్చజెప్పారు. అనంతరం దాసు, శ్రీనివాస్ వర్గీయులు వేర్వేరుగా పటాకులు కాల్చి సంబురాలను జరుపుకొన్నారు. అనంతరం మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూమాజీ అధ్యక్షులకు, నాకు, మండల కార్యవర్గానికి, ఇతర నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండా కాంగ్రెస్ అనుకూల నాయకులు, ఇతర పార్టీల్లో నుంచి బీజేపీలో చేరిన కొందరు, దాసును జిల్లా పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లి మెదక్‌కు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుల పైరవీతో వెల్దుర్తి మండల అధ్యక్షుడి పదవిని కట్టబెట్టారన్నారు. అప్పటి నుంచి బీజేపీ నాయకులకు ఎలాంటి సమాచారం లేకుండా దాసు తన అనుకూల నాయకులతో పార్టీ వ్యవహారాలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని మండి పడ్డారు. ఎన్నో ఏండ్ల నుంచి పార్టీ కోసం తమ లాంటి ఎందరో నాయకులు కష్టపడుతుంటే, బీజేపీని కాంగ్రెస్ నాయకుల చేతిలో కీలుబొమ్మను చేసి, త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లాభం చేకూర్చేలా ప్రయత్నాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఎంపీ రఘునందన్‌రావు, బీజేపీ జిల్లా నాయకులు వెల్దుర్తి మండల బీజేపీని కాపాడకుంటే పార్టీ కనుమరుగు చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

## మెదక్ ఎంపీడీవో కార్యాలయంలో ఖాళీ స్థలం కబ్జా



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మట్టితో చదును చేసి ప్రైవేట్ వ్యక్తి ఏర్పాటు చేసిన డబ్బా

మెదక్‌రూరల్, ఫిబ్రవరి 8: భూముల ధరలు పెరగడంతో ఎక్కడ చూసినా కబ్జాలు పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మెదక్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రైవేట్ వ్యక్తులు పాగా వేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. మెదక్‌లోని ధ్యాన్‌చంద్ విగ్రహం సమీపన మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఉంది. ఈ ఆవరణలోనే జడ్పీ, పీఆర్, ఎంఈవో, సీడీపీవో కార్యాలయలున్నాయి. ఈ ప్రాంగణానికి పెద్ద ఎత్తున ఖాళీ స్థలం ఉండడంతో ప్రవేట్ వ్యక్తుల కన్నుపడింది. అనుకున్నదే తడువుగా అక్కడ చదును చేసి కార్యాలయంలో వ్యాపారపరంగా ఒక డబ్బా ఏర్పాటు చేశారు. అక్కడే ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అధికారులు కార్యాలయాలకు వెళ్లె దారిలో ఇంత జరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయంపై ఎంపీడీవో రఘును వివరణ కోరగా డబ్బా ఏర్పాటు చేసిన మాటా వాస్తవమే, ఆ వ్యక్తిని ముందుగా పిలిచి మాట్లాడుతామని, ఆ డబ్బా తొలిగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్కడ నుంచి డబ్బా తీయకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


పేషంట్ల వివరాలు తెలుసుకుంటున్న శివదయాల్

రామాయంపేట, ఫిబ్రవరి 8: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని మెదక్ జిల్లా కేంద్ర వైద్యాధికారి శివదయాల్ తెలిపారు. శనివారం రామాయంపేట సీహెచ్‌సీని సందర్శించి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. దవాఖానలోని ఫ్రీజర్లు, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, పేషంట్ల గదులను పరిశీలించారు. అనంతరం డాక్టర్ శివదయాల్ మాట్లాడుతూ దవాఖానలో రోగులకు అందించే సేవల్లో అశ్రద్ధ వహించవద్దన్నారు. ల్యాబ్‌కు సంబంధించి రోగులకు ఎప్పటికప్పుడు రక్త నమూనాలు, ఇతర పరీక్షలతో వైద్యం అందించాలన్నారు. చెడిపోయిన ఫ్రీజర్ బాక్సును రెండు రోజుల్లో మరమ్మతు చేయిస్తామన్నా రు. ఆయన వెంట సీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ లింబాద్రి ఇతర సిబ్బంది ఉన్నారు.

## పంచాయతీ ఆపరేటర్లకు అందని వేతనాలు

**- వేతనాల కోసం 5 నెలలుగా ఎదురుచూపులు**


ఎంపీడీవో రాజిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఈ'పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు

నిజాంపేట, ఫిబ్రవరి 8: ఐదు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించడం లేదని నిజాంపేట ఎంపీ కార్యాలయ 'ఈ' పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు పెండింగ్ వేతనాలు చెల్లిస్తూ వేతనాలను పెంచాలని ఎంపీడీవో రాజిరెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యాలయ పనులతో పాటు అధికారుల వివరాలు, వివిధ సర్వేల డాటాను నిర్దేశించిన సమయానికి ఎంట్రీ చేస్తూ నిరంతరం పని చేస్తున్న తమకు సరైన సమయంలో వేతనాలు చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నదన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కౌడిపల్లి, ఫిబ్రవరి 8: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మూసపేట్ గ్రామానికి చెందిన కానపురం యాదగిరి ఈ నెల 7న కౌడిపల్లికి తన ప్యాషన్ ప్రో బైక్‌పై వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెంకట్రావ్‌పేట్ దగ్గరకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఇది గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో నర్సాపూర్‌లోని ప్రభుత్వ దవాణానకు తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు, మెరుగైన వైద్యం కోసం సూరారంలోని నారాయణ దవాఖానకుక తరలించారు. అక్కడ క్షతగాత్రుడు చికిత్స పొందుతున్నాడు. బాధితుడి బావ గుండు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రంజిత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

చేగుంట, ఫిబ్రవరి 8: కర్నాల్‌పల్లి భక్తాంజనేయ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి రావాలని కోరుతూ దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, సాయిబాబా ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ కెఆర్ మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వంటరి రాంరెడ్డి, తుమ్మ యాదగిరి తదితరులున్నారు.

## మెదక్ నుంచి మిర్జాపల్లి వరకు రైల్వే లైన్ పొడిగించాలి


మెదక్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): మెదక్ నుంచి మిర్జాపల్లి వరకు రైల్వే లైన్ పొడిగించాలని బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి ద్వారా మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవికి వినతి పత్రం అందజేశారు. ఈ పత్రంలో మెదక్ అనాదిగా వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతానికి ఉన్న ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ ప్రాంతంలోనే ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చర్చి, ఏడుపాయల వనదుర్గాభవానీ ఆలయం, దేశంలోకెల్లా ఎనిమిదో అత్యంత పెద్దదైన మెదక్ ఖిల్లా తదితర ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. పర్యాటక కేంద్రంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే మెదక్ నుంచి మిర్జాపల్లి వరకు రైల్వే లైన్‌ను పొడిగించే చర్యలు తీసుకోవాలని కోరారు.

## చాకరిమెట్లలో మెదక్ జడ్జి పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న మెదక్ జడ్జి సిరిసాజన్య

శివ్వంపేట, ఫిబ్రవరి 8 : శివ్వంపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం చాకరిమెట్ల శ్రీసహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. స్వామివారిని నర్సాపూర్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి, మెదక్ మున్సిఫ్ కోర్టు జడ్జి సిరిసాజన్య దర్శించుకున్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆంజనేయశర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో పూజారి దేవదత్తుశర్మ ఉన్నారు.

## గణితంలో మెళకువలు నేర్చుకుంటే సులభతరం


ఏఐ టెక్నాలజీ సహకారంతో తయారు చేసిన గణితాన్ని బోధిస్తున్న పూర్వపు విద్యార్థులు

చేగుంట, ఫిబ్రవరి 8: విద్యార్థులు గణితంలో నేర్చుకుంటే సులభతరంగా జవాబులు చేయవచ్చని, పూర్వ విద్యార్థి శ్రీకాంత్ పేర్కొన్నారు. చేగుంట జడ్పీహెచ్ఎస్‌లో ఏఐ టెక్నాలజీ సహకారంతో తయారు చేసిన గణితాన్ని శ్రీకాంత్, వారి మిత్ర బృందం ఇన్నింగ్స్ టు ఆధ్వర్యంలో సుప్రజా, నూతన్, వాసవి, కృష్ణ, లావణ్య, కరుణ బృందం సభ్యులు శనివారం 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు అవగాహన కల్పించారు. గణిత శాస్త్రంలోని మెళకువలు, సులభతరంగా జవాబులు వచ్చేలా వివరించారు. గణితానికి సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రఘుపతి, సుధాకర్‌రెడ్డి, సురేందర్, మనోహర్‌రావు, లక్ష్మణ్, వెంకటేశ్, రాధ, శ్రీవాణి, సరస్వతి, రేఖ, ఉమామహేశ్వరి, ఉమాదేవి, కృష్ణ, నాగరాజు తదితరులున్నారు.

## నేటి నుంచి తుంబురీశ్వర ఆలయ ఉత్సవాలు


తుంబురీశ్వర ఆలయం

టేక్మాల్, ఫిబ్రవరి 8: మండలంలోని వేల్పుగొండలోని తుంబురీశ్వర ఆలయ ఉత్సవాలను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి రావికోటి వైద్య రామశర్మ తెలిపారు. 9న బండ్ల ఊరేగింపు, అఖండ దీపారాధన, 10న రుద్రభిషేకం, పాచి బండ్ల ఊరేగింపు, 11న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, రథోత్సవం, కుస్తీపోటీలు, 12న అన్నదానం, శివకల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సత్వర వైద్యసేవలు అందించాలి

పాపన్నపేట ఫిబ్రవరి 8: రోగులకు వైద్యసిబ్బంది సత్వర సేవలు అందించాలని డీఎంహెచ్‌వో శ్రీరాం ఆదేశించారు. శనివారం పాపన్నపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. దవాఖానల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. డాక్టర్ హరిప్రసాద్, చందర్, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
★ I, MOHAMMAD ABDUL KHALIQ (New Name), MOHAMMED ABDUL AZIZ (Old Name), R/o. H.No. 2-3-26/1/4, Sajidpura, Siddipet Town, Siddipet Dist., T.S. I have Changed My Name from MOHAMMED ABDUL AZIZ to MOHAMMAD ABDUL KHALIQ.
NT-Venkat
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.